మూకదాడులకు కుల,మతాలను అంటగట్టొద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మూక దాడులు జరిగిన పుడు బాధితుల కుల, మతాలను బట్టి మాట్లాడకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా మైనారిటీలపై మూక దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మూక దాడుల బాధితుల కుటుంబాలకు తక్షణమే తాత్కాలిక నష్టపరిహారం చెల్లించే విధంగా ఆదేశించాలని పిటిషనర్ కోరారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన కేసులను పిటిషనర్ తరపు న్యాయవాదులు ప్రస్తావించారు. ఇవి మూక దాడులు కాదని, కేవలం సాధారణ గొడవలు మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వాలు చెప్తున్నాయని తెలిపారు. రాష్ట్రాలు ఈ విధంగా వ్యవహరిస్తే సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయడం సాధ్యం కాదన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, మూక దాడుల గురించి ప్రస్తావించేటపుడు, కేవలం నచ్చిన వాటి గురించి మాత్రమే మాట్లాడవద్దని సలహా ఇచ్చింది. రాజస్థాన్‌లోని టైలర్ కన్నయ్య లాల్ హత్య గురించి ప్రస్తావించింది. ఇటువంటి సందర్భాల్లో కులం, మతం గురించి ప్రస్తావించవద్దని సలహా ఇచ్చింది. బీజేపీ మాజీ నేత నూపుర్ శర్మ పెట్టిన పోస్ట్‌ను షేర్ చేసిన కన్నయ్య లాల్‌ను తన టైలరింగ్ షాప్ వద్ద 2022లో కొందరు దుండగులు హత్య చేసిన సంగతి తెలిసిందే. పిటిషనర్ తరపు న్యాయవాదులు మాట్లాడుతూ, ఈ కేసు గురించి తమ పిటిషన్‌లో ప్రస్తావించలేదన్నారు. ధర్మాసనం ప్రతిస్పందిస్తూ, కేవలం కొన్ని కేసుల గురించి మాత్రమే ప్రస్తావించకూడదని వివరించింది. మూక దాడులపై తీసుకున్న చర్యలను తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు మరో ఆరు వారాల గడువు ఇచ్చింది.

సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో మెదక్,జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్ కుమార్‌ను పరిచయంచేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఆరు గ్యారెంటీలే గడ్డపారలైతయ్..

అవే కాంగ్రెస్‌ను బొందపెడతయ్

- పార్లమెంట్ ఎన్నికల్లో హస్తానికి ఓటమి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలే గడ్డపారలై కాంగ్రెస్‌ను బొందపెడతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన అనే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ శివారులో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. కేసీఆర్ పాలనలో 24 గంటలు కరెంట్ వస్తే.. కాంగ్రెస్ పాలనలో 14 గంటలు కూడా రావట్లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కేసీఆర్ కిట్ మాయమైందని.. ప్రభుత్వ దవాఖానలో మందులే లేవని మండిపడ్డారు. కాంగ్రెస్ రాగానే మిషన్ భగీరథ నీళ్లు.. వృద్ధులకు పెన్షన్ రావట్లేదని.. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. నాడు చేతులు మొక్కారని.. నేడు చేతులు ఎత్తేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వీడియో రూపంలో ప్రజలకు చూపిస్తూ.. రూ.2 లక్షల రుణమాఫీ అయిందా.. కాలేదా.. అని అడిగారు. రుణమాఫీ అయినవాళ్లను కాంగ్రెస్‌కు, కాని వాళ్లను కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వడ్లకు బోనస్, రూ.4 వేల పింఛన్, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500, రైతుబంధుపై కూడా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని వివరించారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసేందుకు సిద్ధంగా లేరని, కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఓటు వేయవద్దని..పెనం మీద నుంచి పొయ్యిలో పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ గెలిస్తే ఇంకా ఆగమైతమని, ఎప్పటికైనా బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణకు శ్రీరామరక్ష అని నొక్కి చెప్పారు. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన మంచి పనులు ప్రజలే చెబుతారని, పదేండ్లలో బీజేపీ చేసిన మంచి పని ఒక్కటైనా చెప్పగలరా ? అని ప్రశ్నించారు. బీజేపోళ్లకు చెప్పేందుకు పథకాలు లేకనే ఫొటోలు, క్యాలెండర్లు పంచుతున్నారని ఎద్దేవా చేశారు. జీఎస్టీ, పెట్రోల్, డీజీల్, గ్యాస్ ధరలు పెంచి.. బీజేపీ పేదల నడ్డి విరిచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి ఒక మెడికల్ కాలేజీ, ఒక్క నవోదయ పాఠశాల ఇవ్వలే.. అడుగడుగునా తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీకి ఒక్క ఓటూ వేయవద్దని పిలుపునిచ్చారు. వడ్లు కొనమంటే నూకలు బుక్కమని తెలంగాణ జాతిని అవమానించారని, బీజేపీ వారికి తెలంగాణ ప్రజలు నూకలు బుక్కిస్తారని హెచ్చరించారు. పేదల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

బీజేపీలో అసమ్మతి సెగ

- తలపట్టుకుంటున్న బీజేపీ రాష్ట్ర నాయకత్వం
- ఇప్పటికీ అందుబాటులోకి రాని రాజాసింగ్
- మల్కాజిగిరిలో అలక వీడని కీలక నాయకులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ఈ సారి రాష్ట్రంలో భారీగా లోక్‌సభ సీట్లు గెలుచుకోవాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీకి నేతల అసమ్మతి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. పైకి అంతా బాగుందన్నట్టుగా వ్యవహరిస్తున్నా.. మెజార్టీ నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో అసంతృప్తి సెగలు రేగుతున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మొదలుకొని.. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో ఏం చేయాలో తెలియక రాష్ట్ర నాయకత్వం మల్లగుల్లాలు పడుతున్నది. అన్నింటికంటే ముఖ్యంగా రాజాసింగ్ వ్యవహారం తలనొప్పిగా తయారైంది. డిసెంబర్‌లో ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి మొదలు రాజాసింగ్ బీజేపీ నాయకత్వంపై తిరుగుబాటు చేస్తున్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత పదవి దక్కకపోవడంతో ఆయన అలకపాన్పు ఎక్కిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఎంత మంది నేతలు సముదాయించినా ఆయన వెనక్కి తగ్గడం లేదు. హైదరాబాద్ అభ్యర్థిగా మాధవీలతను ప్రకటించడంతో ఆయన అసంతృప్తి తారస్థాయికి చేరింది. ఏకంగా 'అభ్యర్థిగా మగవాళ్లే దొరకలేదా?' అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల రాష్ట్ర లోక్‌సభ ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి కలిసి రాజాసింగ్ ఇంటికి వెళ్లి చర్చలు జరిపినా ఫలితం కనిపించలేదు. దీంతో హైదరాబాద్, సికింద్రాబాద్, జహీరాబాద్ నియోజవర్గాల్లో రాజాసింగ్ సేవలు వాడుకోవాలన్న బీజేపీ అధిష్ఠానం ప్లాన్ ఫెయిల్ అయ్యింది.

ఎక్కడికక్కడ సీనియర్ల గుర్రు

సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని కొందరు సీనియర్లు అసంతృప్తితో ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకొని ఉన్నామని, పదవుల పరంగా ఎదగలేదని, ఆర్థికంగా ఎదగలేదని, కొత్తగా వచ్చిన నేతలకు అవకాశాలు ఇస్తూ తమను దూరం పెడుతున్నారని అలకబూనినట్టు చర్చ జరుగుతున్నది. 'పార్టీలు మారుతూ ఉంటే మేము కూడా సంపాదించేవాళ్లం.. డబ్బు కోసం కాకుండా సిద్ధాంతం కోసం పనిచేయడమే మేం చేసిన పాపమా?' అని వాపోతున్నట్టు తెలిసింది. అందుకే కొందరు ఎన్నికల ప్రచారంలో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఇక మల్కాజిగిరి టిక్కెట్‌ను ఈటల రాజేందర్‌కు ప్రకటించగానే.. మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీశ్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. మల్కాజిగిరిలో సీనియర్ నేత మురళీధర్ రావు సైతం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానంటూ ట్వీట్ చేశారు. ఆ తర్వాత సైలెంట్ అయిపోయారు. తాజాగా కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. మల్కాజిగిరి టిక్కెట్ కొమురయ్య, వీరేందర్ గౌడ్, సురేశ్ రెడ్డి, సామ రంగారెడ్డి.. తదితర నేతలంతా అసంతృప్తితో ఉన్నారు. మహబూబ్‌నగర్ టిక్కెట్ ఏకంగా పార్టీలో చిచ్చు పెట్టింది. డీకే అరుణకు కేటాయించగానే జితేందర్ రెడ్డి బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. నల్గొండ పార్లమెంట్ బీజేపీ టిక్కెట్‌ను శానంపూడి సైదిరెడ్డికి ఇవ్వొద్దని నల్గొండ జిల్లాకు చెందిన పలువురు నేతలు ఏకంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్ నుంచి మాజీ మంత్రి బాగారెడ్డి కుమారుడు జైపాల్‌రెడ్డి, ఆలె నరేంద్ర కుమారుడు ఆలె భాస్కర్ వంటి నేతలను కాదని బీఆర్ఎస్ నుంచి బీబీపాటిల్‌ను అప్పటికప్పుడు చేర్చుకొని టిక్కెట్ ఇవ్వడం అసంతృప్తికి దారి తీసింది. నాగర్‌కర్నూల్‌లో ఢిల్లీకి వెళ్లి కండువా కప్పుకున్న మరుక్షణమే భరత్‌కు కేటాయించడంతో ఆ సీటు ఆశించిన బంగారు లక్ష్మణ్ కుమార్తె బంగారు శృతి కొన్నాళ్లపాటు సైలెంట్ అయిపోయారు. మెదక్ నుంచి రఘునందన్ రావుకు టిక్కెట్ ఇవ్వడంతో సీనియర్ నేతలకు అవకాశం ఇవ్వకుండా ఓడిపోయిన నేతకు ఎలా టిక్కెట్ ఇస్తారనే చర్చ మొదలైంది. నిజామాబాద్‌లో ధర్మపురి అర్వింద్ నోటి దురుసుపై సీనియర్లు ఎప్పటి నుంచో ఆగ్రహంగా ఉన్నారు. మండలాధ్యక్షుల మార్పు వివాదం గతంలో రాష్ట్ర కార్యాలయంలో బైఠాయించే స్థాయి దాకా చేరిన సంగతి తెలిసిందే. వారంతా ఇప్పుడు వ్యతిరేకంగా పనిచేసే అవకాశం ఉన్నదని చర్చ జరుగుతున్నది. కరీంనగర్‌లో బండి సంజయ్ ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేయడంపైనా నేతలు అసంతృప్తితో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా వేరే వారికి అవకాశం ఇస్తే ఏమయ్యేదని అంతర్గతంగా చర్చ జరుగుతున్నదని సమాచారం. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లోనూ తమను కలుపుకొని పోవడం లేదని కొందరు నేతలు అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. ఆదిలాబాద్‌లో సోయం బాపూరావును పక్కనబెట్టడంపైనా వివాదం చెలరేగుతున్నది. ఇలా ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో అసంతృప్తి జ్వాలలు చెలరేగుతుండటంతో రాష్ట్ర నాయకత్వం కూడా క్రమంగా చేతులెత్తేస్తున్నట్టు తెలుస్తున్నది. నేతల బుజ్జగింపుల బాధ్యతను ఆయా అభ్యర్థుల మీద వదిలేసినట్టు చర్చ జరుగుతున్నది.

జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

అబద్ధాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్

- 420 హామీల అమలు ఎక్కడ?
- ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- బీర్‌పూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం

సారంగాపూర్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారం చేపట్టిందని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. కాంగ్రెస్ 420 హామీలతో ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీ చెప్పిన అబద్ధాలను ప్రజల ముందు ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. మంగళవారం సాయంత్రం జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మండపంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎన్నికల ఇన్‌చార్జి లోక బాపురెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఈ ఐదేండ్లలో చేసింది శూన్యమని, ప్రజలకు ముఖం చూపించే పరిస్థితి లేదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ఈ ప్రాంతాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. నిధులు తీసుకురాని అసమర్థుడు ధర్మపురి అర్వింద్ అని దుయ్యబట్టారు. బీజేపీ ప్రజల చెవిలో పూలు పెడితే, కాంగ్రెస్ ప్రజల నెత్తిమీద భస్మాసుర హస్తం పెట్టిందని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపిస్తే ఇక్కడ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తాపించి నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు.

ఢిల్లీ కప్పం కోసం రైతులకు టోకరా

దేవరకొండ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి

- మద్దతు ధరకు ఎగనామం పెట్టినా పట్టని ప్రభుత్వం
- కేసీఆర్ కదిలితేనే పంటలకు సాగునీళ్లు వచ్చినయ్
- సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టేందుకు సీఎం, మంత్రులు రాష్ట్రంలో రైతులకు టోకరా వేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రైస్ మిల్లర్ల నుంచి వందల కోట్లు వసూలు చేసి ధాన్యం కొనుగోళ్లను వాళ్లకే వదిలేశారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ పర్యవేక్షణ లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి మద్దతు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అడుగు బయటపెడితే తప్ప సాగునీళ్లు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉన్నదని విమర్శించారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తాల్సిన రేవంత్‌రెడ్డి పార్టీ ఫిరాయింపుల కోసం గేట్లు ఎత్తడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ రాగానే కృష్ణానదిని కేంద్రం చేతిలో పెట్టారని, కేసీఆర్ నల్లగొండ మీటింగ్‌కు వచ్చి గర్జిస్తేనే కేఆర్ఎంబీపై అసెంబ్లీలో తీర్మానం పెట్టారని గుర్తుచేశారు. ఇటీవల ఎండిన పొలాలను చూసి రైతుల పక్షాన కేసీఆర్ మాట్లాడితే సర్కార్ కదలక తప్పలేదని, వెంటనే కాళేశ్వరం లిఫ్టులు నడిపి నీళ్లు ఇచ్చారని చెప్పారు. ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం, రూ.500 బోనస్, రైతు భరోసా, సాగునీళ్లు అడిగితే.. జవాబు చెప్పలేక రేవంత్‌రెడ్డి దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. పాలన చేతగాక కేసుల పేరుతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఇప్పటి వరకు తెల్చిందేమీ లేదని, నిజంగా వెలికితీయాలనుకుంటే చంద్రబాబు నుంచి మొదలు పెట్టాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, పల్లా ప్రవీణ్ రెడ్డి, కేతావత్ బిల్యానాయక్, కిషన్‌నాయక్, వడ్త్యా రమేశ్‌నాయక్, వశ్యానాయక్, కంకణాల ప్రవీణ, రెగట్టె మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా. చిత్రంలో మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- బీఆర్ఎస్ ఖమ్మం సమావేశంలో నామా

ఖమ్మం, ఏప్రిల్ 16: కాంగ్రెస్ చెప్పిన మాయమాటలను, ఆ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. అందుకే ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్న కసితో ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ఆ ప్రభుత్వం.. ఆ తరువాత వాటికి తిలోదకాలిచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఖమ్మంలోని మమత దవాఖాన ప్రాంగణంలో మంగళవారం జరిగిన పార్టీ ఖమ్మం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా సమరోత్సాహంతో పని చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని, గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను దూరం చేసుకున్నందుకు ప్రజలు కూడా ఎంతో బాధపడుతున్నారని తెలిపారు.

తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి..

మెగా డీఎస్సీ అంటారా?

బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మంథని, ఏప్రిల్ 16: అసెంబ్లీ ఎన్నికల ముందర నిరుద్యోగులకు మెగా డీఎస్సీ అంటూ గొప్పలు చెప్పిన కాంగ్రెస్.. తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి దానినే మెగా డీఎస్సీ అంటారా? అని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథనిలోని ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొప్పుల మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ దరఖాస్తుల ఫీజులు రూ.200 ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం దానిని ఏకంగా రూ.1000కి పెంచిందని మండిపడ్డారు. ఒక్క నిరుద్యోగి 3 పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే రూ.3 వేల వరకు ఖర్చు అవుతున్నదని, అంత డబ్బు ఆ నిరుద్యోగి ఎలా చెల్లిస్తాడని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు ఆగస్టు 15 నుంచి రూ.2 లక్షల రుణమాఫీని చేస్తామని మోసపు ప్రకటనలు చేస్తున్నదని, కాంగ్రెస్ మోసాలను ప్రజలు గమనించాలని సూచించారు.

రుణమాఫీ వాయిదా బాధాకరం

- ఆగస్టు 15 వరకు జాప్యం సరికాదు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నారాయణపేట, ఏప్రిల్ 16 : అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆగస్టు 15 వరకు గడువు తీసుకోవడం హాస్యాస్పదమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎంపీ ఎన్నికల ముందే రుణమాఫీ చేయని ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ముందు చేస్తుందా? అని అనుమానం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తా వద్ద ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..గత ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటిగా పనిచేసి ప్రజలను విభజించి ఓట్లు దండుకున్నాయని విమర్శించారు.తాగు,సాగునీరు, కరెంట్ కోసం ఈ పదేండ్లలో ఎప్పుడూ ధర్నాలు చేయలేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలకుల తీరు కారణంగా నిరసన బాట పట్టాల్సి వచ్చిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటికావడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కృషితోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయిందన్నారు. తెలంగాణ రాకముందు, వచ్చాక ఎలా ఉందో ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. ఈ ఎన్నికలో తనను మరోసారి గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేటలో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి.చిత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ప్రాజెక్టులను పూర్తి చేసేవరకు పోరాడుతాం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 16 : కేసీఆర్ సర్కారు హయాంలో ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టులను పూర్తి చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రాజెక్టు పనులు తక్షణమే పూర్తిచేసి వచ్చే సీజన్‌లో సాగునీరందించే వరకు పోరాడుతామని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను నయవంచన చేస్తూ అధికారం చేపడుతున్నారని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలును విస్మరించిన కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం తరపున ఒక్కరు కూడా స్పందించడం లేదని విమర్శించారు.